

నవోదయ పాఠశాలలో మాస్టార్ల నియామకానికి ఇంటర్వ్యూలు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ స్కూల్‌లో ఉపాధ్యాయుల నియామకానికి జేసీ చాంబర్‌లో శనివారం ఇంటర్వ్యూలు జరిగాయి. జేసీ సేతు మాధవన్, డీఈవో మాణిక్యం నాయుడు, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పీజీటీ ఇంగ్లీష్, ఫిజిక్స్, గణితం రెండు పోస్టుల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక సంవత్సర కాలానికి కాంట్రాక్ట విధానంలో పనిచేయడానికి ఈ ఎంపిక నిర్వహించారు. మెరిట్‌లో వచ్చిన వారినే నియమిస్తామని జేసీ తెలిపారు.



చీపురుపల్లి: జి.అగ్రహారంలో గణపతి విగ్రహం ఊరేగింపు

గణపయ్యకు ఘన వీడ్కోలు

6

- జిల్లాలో గణనాథుని నిమజ్జనాల సందడి

వినాయక నిమజ్జనాలు శనివారం రాత్రి సందడిగా సాగాయి. ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శనలు, డీజే పాటలకు డ్యాన్సులు, వివిధ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. తారాజువ్వలు, బాంబుల మోతలతో యువకులు ఉర్రూతలూగారు. ఆదివారం చంద్రగ్రహణం ఉండటంతో వినాయక ప్రతిమలన్నీ శనివారం నాటికి నిమజ్జనం చేయాలని పంచాంగ కర్తలు ముందుగా సూచించిన విషయం తెలిసిందే. అయితే ఒకే రోజు ఎక్కువ విగ్రహాలను తరలించడంతో గ్రామాలు, పట్టణాలు మార్మోగాయి.

రేషన్ డిపోలకు కొత్త ఈపోస్ మిషన్లు



- వచ్చే నెల నుంచి వినియోగం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల్లో ఇప్పటి వరకూ ఉన్న పోస్ మిషన్లను ప్రభుత్వం మార్చుతోంది. కొత్త వాటిని అందిస్తోంది. అప్‌డేట్ వెర్షన్‌తో కూడిన వీటితో వచ్చే నెల నుంచి డీలర్లు రేషన్ ఇవ్వనున్నారు. ఇప్పటికే కొత్త యంత్రాల వినియోగంపై డీలర్లకు అవగాహన కల్పించారు. రేషన్ డిపోల్లో అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో 2015 సంవత్సరంలో ఈపోస్ మిషన్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. జీఎల్ 11 మిషన్లను అందించింది. దాదాపు 10 సంవత్సరాలు తరువాత వీటిని మార్పు చేశారు. ఇప్పుడు వీపీ 21 ఆండ్రాయిడ్ మిషన్లను అందజేస్తున్నారు. వీటికి 5జీ సపోర్టు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 1249 రేషన్ డిపోలు ఉన్నాయి. అన్నింటికీ కొత్త యంత్రాలను అందిస్తున్నారు.

రోడ్లు ఛిద్రం

- వర్షాలకు జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు
- ఇప్పటికే పాడైన చోట మరింత పెద్దగా గోతులు
- వాటిపై ప్రయాణానికి అవస్థలు
- తక్షణం బాగు చేయాలని అధికారులకు విన్నపాలు
- మళ్లీ తుఫాన్ వస్తే మరింత దారుణంగా మారే ప్రమాదం



భోగాపురం మండలం రావాడ గ్రామానికి వెళ్లే రహదారి ఇలా

విజయనగరం/ గంట్యాడ/ కొత్తవలస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. 139 కిలోమీటర్ల మేర రహదారులు పాడైనట్లు రోడ్లు భవనాల శాఖ అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. ఆయా రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.4.30కోట్ల మేర అవసరమని ఆ శాఖాధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. వర్షాలకు పాడైన రోడ్లు ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేవు. పెద్ద, పెద్ద గోతులు పడిన చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ ఆయా రోడ్లలో ప్రయాణం చాలా కష్టంగా మారింది. పూసపాటిరేగ మండలంలోని గుంపాం, భోగాపురం మండలంలోని రావాడ, నవరవల్లి రోడ్లు, బొబ్బిలి- తెర్లాం రహదారి, గజపతినగరం నుంచి మెంటాడకు వెళ్లే రహదారి, గజపతినగరం మండలం బగ్గాం నుంచి బంగారమ్మపేటకు వెళ్లే రహదారి చాలా దయనీయంగా మారాయి. విజయనగరంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు కూడా వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

రహదారుల్లో దెబ్బతిన్న కల్వర్టులు

గంట్యాడ మండలంలోని కొటారుబిల్లి కూడలి నుంచి సిరిపురం, మురపాక, పెదవేమలి, చంద్రంపేట, వసంత గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రెండు కల్వర్టులు పూర్తిగా మూసుకు పోయాయి. దీంతో పైనుంచి వస్తున్న వర్షపు నీరు ఈ కల్వర్టుల ద్వారా దిగువనున్న చెరువుల్లోకి వెళ్లడం లేదు. సిరిపురం ముందు ఉన్న కల్వర్టుకు పెద్ద రంధ్రం పడడంతో మట్టితో కప్పేశారు. దీంతో వర్షపు నీరు దిగువకు వెళ్లడం లేదు. భారీ వర్షం కురిస్తే (మిగతా 8వ పేజీలో..)



విజయనగరం: చింతలదిమ్మ వద్ద రోడ్డు పరిస్థితి

అప్పుడు 40 అడుగులు ఇప్పుడు 4 అడుగులే



పిల్ల కాలువగా మారిన పంట కాలువ

- పడాలపేటలో గెడ్డకాలువ ఆక్రమణ
- పిల్ల కాలువగా మారిన వైనం

విజయనగరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం మున్సిపాలిటీ నగరపాలక సంస్థగా మారిన తరువాత నుంచి నగరం చుట్టుపక్కలతో పాటు విజయనగరం మండల పరిధిలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో భూ బకాసురులు తయారయ్యారు. పెద్దఎత్తున ప్రభుత్వ భూములను, గెడ్డపోరంబోకు స్థలాలు, కాలువలను ఆక్రమించి రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. విజయనగరం మండలం పడాలపేట పెట్రోల్ బంకు నుంచి కుమిలి గ్రామానికి వెళ్లే మార్గంలో గెడ్డ కాలువ ఆక్రమణ ఇందుకో ఉదాహరణ. గెడ్డను ఆక్రమించి ఏకంగా రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రోడ్డు వేసేశారు. దీంతో 40 అడుగుల వెడల్పు ఉండే కాలువ 4 అడుగులకు తగ్గిపోయింది. పడాలపేట (మిగతా 8వ పేజీలో..)

ఆ పీఏసీఎస్‌లకు కమిటీలు ఎప్పుడో?





- నెల్లిమర్ల కూటమిలో కొనసాగుతున్న విభేదాలు!
- జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల నియామకం
- ఆ నాలుగు మండలాల్లోనే పెండింగ్
- ఇప్పటికీ ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ ఇన్‌చార్జి

విజయనగరం, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గ కూటమిలో పొడచూపిన విభేదాలు సమసిపోవడం లేదు. నేతలు ఎవరికి వారే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఏ అంశంలోనూ ఏకాభిప్రాయానికి రావడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచీ ఇదే పరిస్థితి. ఆ ప్రభావం పీఏసీఎస్‌లపై బలంగా పడింది. జిల్లా అంతటా కమిటీలు ఏర్పాటైనా ఇక్కడ మాత్రం జాబితాలు కొలిక్కి రావడం లేదు. స్థానిక జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి వర్సెస్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నట్టు మనస్పర్థలు సాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో టీడీపీకి బలం ఉండగా పొత్తులో భాగంగా సాధారణ ఎన్నికల్లో ఇక్కడ జనసేనకు టిక్కెట్ దక్కింది. టీడీపీ సహకారంతో ఎమ్మెల్యేగా నాగమాధవి గెలిచారు. అయితే ఆదినుంచి ఎమ్మెల్యేకు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జికి మధ్య సమన్వయం లేదు. ఓ సమావేశంలో ఇద్దరూ తీవ్ర వాదనలకు దిగిన విషయం తెలిసిందే. తర్వాత ఇరు పార్టీల పెద్దల సూచనతో బహిరంగ గొడవలు లేనప్పటికీ అంతర్గతంగా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇద్దరి మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. దీనివల్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు)కు కమిటీల ఎంపిక జరగలేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమించారు. నెల్లిమర్ల నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లోనూ పెండింగ్‌లో ఉంచారు.

- నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీకి పెట్టని కోట.

అంతకుముందు (మిగతా 8వ పేజీలో..)



6

ఎరువుల కోసం బారులు

గజపతినగరం పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం 12 టన్నుల యూరియా పంపిణీ చేపట్టగా వాటి కోసం రైతులు బారులుతీరారు. స్టాక్ తక్కువ కావడంతో కొందరికి పూర్తి స్థాయిలో అందలేదు.

రాణికట్ వ్యాధితోనే కోళ్ల మృతి

- ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందీ లేదు
- పశు సంవర్ధకశాఖ ఏడీ కన్నంనాయుడు



కొత్తవలస ఫారంలో మృతిచెందిన కోళ్లు(ఫైల్)

కొత్తవలస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పౌల్ట్రీజోన్‌లో కొద్దిరోజులుగా అంతుచిక్కని వ్యాధితో మృతి చెందుతున్న లక్షలాది కోళ్ల మృతికి రాణికట్ వ్యాధి సోకడమే కారణమని నిర్ధారణ అయిందని కొత్తవలస పశు సంవర్ధకశాఖ ఏడీ కన్నంనాయుడు తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూగాని, ఇన్‌క్లూజన్ హెపటైటీస్ వ్యాధి కాని సోకలేదని, దీనివల్ల ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందిలేదని అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో శనివారం మాట్లాడిన ఆయన కోళ్ల మృతికి కారణాలు వివరించారు. లక్షలాది కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణమని కొంతమంది కోళ్లఫారాల రైతుల చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృతి చెందితే ప్రభుత్వమే కోళ్లఫారాలను స్వాధీనం చేసుకుని, అప్పటికి బతికి ఉన్న కోళ్లను చంపేసి, ఒక్కో కోడికి రూ.35 చొప్పున నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. ఇప్పటికిప్పుడు మళ్లీ కోళ్లను పెంచకుండా కొద్ది రోజుల పాటు షెడ్‌లను ఖాళీగానే ఉంచాలని, ఆపై పశుసంర్ధకశాఖాధికారుల సలహాలు, సూచనలను పాటించాలని చెప్పారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని వైద్యారోగ్య, పశు సంవర్ధక అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పీహెచ్‌పీ, సీహెచ్‌సీల ద్వారా అందిస్తున్న వైద్యం, గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది, మందులు, ఇతర సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించా లని సూచించారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖాధికారి జీవనరాణి, పశుసంవర్ధక శాఖ జేడీ దామోదరరావు, ఇతర అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

గణపయ్యకు ఘన వీడ్కోలు

● మేళతాళాలతో ఊరేగింపు ● ఉత్సాహంగా పాల్గొన్న యువత



విజయనగరంలో గణనాథుని విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తూ...



బొబ్బిలిలో దశావతారాల గణేశుని ఊరేగింపు



బొబ్బిలి: ఊరేగింపులో పులివేషాలు

విజయనగరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ఆబాలగోపాలం ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణాలు, పల్లెల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను తొలుత స్థానికంగా ఊరేగించారు. యువత డ్యాన్సులతో హోరెత్తించారు. జానపద కళారూపాలు, బళ్ల వేషాలు ఏర్పాటు చేశారు. అనంతరం సమీపంలోని నదులు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో శనివారంతో నిమజ్జనాలు పూర్తి చేయాలని వేద పండితులు సూచించడంతో నిర్వాహకులు ఆమేరకు ఏర్పాట్లు చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలో అధికారికంగా 160 విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు సమాచారం. విజయనగరం వన్‌టౌన్ పరిధిలో 80, టూ టౌన్ పరిధిలో 80 విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా కేంద్రంలో సుమారు వందమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. బొబ్బిలి, మక్కువ, సాలూరు, బొండపల్లి, చీపురుపల్లి, తదితర ప్రాంతాల్లోనూ గణేశ విగ్రహ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. సాలూరు అర్బన్, రూరల్ పోలీస్ సర్కిల్‌లో ఉన్న గ్రామాల్లో శనివారం 148 గణనాథుల విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. వివిధ మండపాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను వేలంలో భక్తులు దక్కించుకున్నారు.



వీరఘట్టం: నిమజ్జనానికి తరలుతున్న భారీ గణేశుని విగ్రహం



సాలూరు రూరల్: ఊరేగింపులో మహిళలు



సాలూరు రూరల్: నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



సాలూరు: మేళతాళాలతో వినాయక విగ్రహం ఊరేగింపు



బొండపల్లి: కనిమెరకలో...



మక్కువలో...



నాదస్వర కచేరీ చేస్తున్న విద్యార్థులు

ముగిసిన సంగీత, నృత్య మహోత్సవాలు

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆగస్టు 27వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలలో అనేక మంది ఔత్సాహిక సంగీత, నృత్య కళాకారులు పాల్గొన్నారు. ముగింపు ఉత్సవంలో భాగంగా కళాశాల విద్యార్థులు నాదస్వర కచేరీ నిర్వహించారు. టి.రామకృష్ణ, రాంబాబులు వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

హద్దు దాటిన వారిపై కొరడా

● నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు ● ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హద్దు దాటిన వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ వద్ద తనిఖీలు చేశారు. నిబంధనలు అతిక్రమించిన ద్విచక్ర వాహనదారులపై 955 కేసులు నమోదు చేసి, రూ.4,77,460 ఈ-చలానా విధించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బ్లాక్ స్పాట్స్ వద ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. వాహనాలను ప్రమాదకరంగా నడిపిన వారిపై 88 కేసులు, హెల్మెట్ ధరించని వారిపై 155 కేసులు, డ్రైవింగ్ చేసిన మైనర్లపై 8 కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై 471 కేసులు, భద్రతా నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 46, నెంబరు ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలపై 187 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ద్విచక్ర వాహనదారులకు రోడ్ సేఫ్టీ నిబంధనలపై, హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలను సంబంధిత అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారని ఎస్పీ తెలిపారు.



మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సర్వే

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, ఈస్ట్‌కోస్ట్ డీఆర్‌ఎం కార్యాలయం నుంచి వచ్చిన డిప్యూటీ సీఈ, ఈఈ తదితరులు శనివారం సర్వే నిర్వహించారు. వేణుగోపాలపురం డైట్ కాలేజ్ వద్ద, గాజులరేగ రాళ్లమాలపల్లి ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద, వీటీఅగ్రహారం మార్కెట్ యార్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అధికారులు శనివారం సర్వే చేపట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మూడు చోట్ల అవసరమైన ఏర్పాట్లకు రైల్వే అధికారులు కౌన్సిల్ అనుమతి కోరారని చెప్పారు. 30 మీటర్ల వెడల్పు, కిలోమీటర్ పొడవున కుడి ఎడమ వైపుల సర్వీస్ రోడ్లు నిర్మించనున్నారని తెలిపారు. ఈ సర్వేలో ఈఈ ప్రసాద్, టౌన్ సర్వేయర్ సింహాచలం, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అందమైన కుండీ... రహస్యం చెబుతాం రండి!

● ఆకర్షణీయంగా బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం పరిసరాలు



వ్యర్థాలతో చేసిన కుండీలలో ఉన్న పూల మొక్కలు



పాత టైర్లను ఉపయోగించి ఇలా ఆకర్షణీయంగా..



లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్



బొబ్బిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కార్యాలయ ఆవరణలోకి ఎప్పుడైనా అడుగు పెట్టారా? అక్కడి ముఖద్వారం వద్ద అందమైన రంగులతో ఉన్న కుండీలలో పెరుగుతూ... ఆకర్షణీయంగా కనిపించే మొక్కలు పలికే స్వాగతాన్ని అందుకున్నారా? అడుగు పెట్టి ఉంటే... అంత మంచి కుండీలు ఎక్కడి నుంచి తెచ్చారా అనే సందేహం కలుగుతోందా? విశేషమేంటంటే... ఆ మొక్కలు పెరుగుతున్న కుండీలు ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి రూపొందించినవి. వాడి పారేసిన ప్లాస్టిక్ వస్తువులు, మున్సిపల్ ట్రాక్టర్లు, ట్రక్కులు, ఎక్సకవేటర్ల పాత టైర్లకు రంగులు వేసి... వాటిని అందంగా తీర్చిదిద్దారు. వాటిలోనే వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వారంతా వాటిని చూసి ముగ్ధులవుతున్నారు. వాటి గురించి మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి వద్ద ప్రస్తావిస్తే.. 'ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలనే సందేశంతో వాటిని ఏర్పాటు చేశాం. సాధారణంగా ప్లాస్టిక్ వస్తువులు వినియోగించిన తర్వాత వాటిని చెత్తకుప్పలు, కాలువలు, రోడ్ల పక్కన జనం పడేస్తుంటారు. అలా చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది. దానికి బదులుగా ఇలా మొక్కల పెంపకం వంటి వాటికి వ్యర్థాలను వాడడం వల్ల కొంతవరకైనా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం. అందుకే ఇలా వినియోగిస్తున్నాం' అని చెప్పారు.

ఎరువుల కోసం బారులు



పీఏసీఎస్ వద్ద అధికారుల కోసం ఎదురు చూస్తున్న రైతులు

గజపతినగరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారు. మండలంలో తొలి విడతలో 20 టన్నులు, రెండో విడతలో 15 టన్నుల యూరియాను పది రోజుల కిందట అధికారులు తీసుకువచ్చారు. గత రెండు రోజుల్లో మరుపల్లి, ఎం.గుమడాం, గంగచోళ్లపెంట, గజపతినగరం రైతుసేవా కేంద్రాలకు 150 బస్తాలు పంపిణీ చేశారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో 12 టన్నులు, శ్రీసత్యసాయి ట్రేడర్స్‌లో 12టన్నుల యూరియా సరఫరా చేశారు. సత్యసాయి ట్రేడర్స్‌లో ఏవో కిరణ్ కుమార్ స్వయంగా చీటీలు ఇచ్చి ప్రతి రైతుకు ఒక బస్తా యూరియా చొప్పున అందజేసారు. పీఏసీఎస్ కార్యాలయంలో 12 టన్నుల యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. ఉదయం నుంచి అధికారులు వచ్చినంత వరకు రైతులు పడిగాపులు కాశారు. పూర్తి స్థాయిలో రైతులకు యూరియా అందకపోవడంతో చాలా మంది వెనుదిరిగిపోయారు. దీనిపై ఏవో కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సోమవారం 20 టన్నుల యూరియా వస్తుందన్నారు పాతబగ్గాం, కొత్తబగ్గాం గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే 10 టన్నులు గంగచోళ్లపెంటలో పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

లక్కవరపుకోటలో...

లక్కవరపుకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతతో రైతులు అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల్లో కనీసం ఒక బస్తా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. నాట్లు వేసి సుమారు 2 నెలలు కావస్తున్నా అవసరమైన యూరియా దొరకలేదని... సమయం మించిన తరువాత వచ్చినా లాభం లేదని రైతులు మండిపడుతు న్నారు. కనీసం ప్రైవేటుగా కొందామన్నా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతపై మండల వ్యవసాయాధికారి హరికృష్ణను వివరణ కోరగా ఎప్పుడు వస్తుందో స్పష్టమైన తేదీ చెప్పలేక పోతున్నామని తెలిపారు. రైతులు నానో యూరియాను వినియో గించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా పంపిణీ విషయంలో అధైర్యపడవద్దని ఏవో టి.సంగీత అన్నారు. స్థానిక పీఏసీఎస్ ద్వారా శనివారం సుమారు 256 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1.5 ఎకరాల లోపు విస్తీర్ణం గల రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశామని చెప్పారు. పీఏసీఎస్ సీఈవో సీహెచ్.మహేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, పోలీసు కానిస్టేబుల్ పైడిరాజు, వీఏఏ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.



డెంకాడలో పోలీసుల సమక్షంలో పంపిణీ

గంట్యాడలో...

గంట్యాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. కొటారుబిల్లి కూడలిలో ఉన్న మన గ్రోమోర్ కేంద్రానికి 250 యూరియా బస్తాలు వచ్చాయి. అందరికీ యూరియా లభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.



గంట్యాడలో యూరియా కోసం రైతుల క్యూ

యూరియా కొరత లేదు

● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్/రాజాం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తగినన్ని యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారందరికీ యూరియాను అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలోని 1122 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవాకేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఉందన్నారు. సోమవారం మరో 850 టన్నులు, గురువారం వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు రానుందని వెల్లడించారు. ఈ నెలాఖరుకు మరో 3వేల టన్నులు రానుందని ఆయన తెలిపారు. యూరియా కొనుగోలు విషయంలో రైతులు సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రైతులు 94419 57315 నెంబరుకు ఫోన్ చేసి నేరుగా తమతో మాట్లాడవచ్చని అన్నారు. రాజాం నందిని ట్రేడర్స్‌కు ఈనెల 4వ తేదీన 24 టన్నుల యూరియా సరఫరా చేశామని, తగినంత నిల్వలు ఉన్నాయని వివరించారు. షాపు దగ్గర ఎరువుల కోసం నిలుచున్నప్పుడు ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదం గొడవకు దారి తీసిందన్నారు. అందుకు రైతుల మధ్య తోపులాట జరిగిందన్నారు. దీనికి ఎరువుల సరఫరాతో సంబంధం లేదని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరానికి మించి యూరియాను తీసుకొని వెళ్లేందుకు ప్రయత్నిస్తుండటంతో దీనిని నియంత్రించి ప్రతి రైతుకు యూరియా అందేవిధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. సంబంధిత డీలర్ల వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఒక 1బికి ఒక యూరియా బస్తా లెక్కన శనివారం పంపిణీ చేశారు. మండలంలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరంలేదని మండల వ్యవసాయశాఖ అధికారి నీలిమ తెలిపారు. అందరికీ యూరియా అందేవిధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేట్టిందని ఆమె తెలిపారు.

నేడు రామతీర్థం దేవస్థానం మూసివేత

నెల్లిమర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మూసివేస్తారని సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 3.30 గంటలకు రామస్వామి దేవాలయాన్ని మూసివేస్తామని చెప్పారు. అలాగే మరుసటిరోజు సోమవారం సంప్రోక్షణ అనంతరం 11.30 గంటలకు బాలభోగం నివేదన తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు.

ఫారెస్టు బీటు ఆఫీసర్ల పరీక్ష కోసం కంట్రోల్ రూం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ పరీక్ష కోసం అభ్యర్థులకు సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని డీఆర్వో శ్రీనివాసమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి ఈ కంట్రోల్ రూం నెంబరు 08922-236947కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఎస్.కోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశాఖ-అరకు రహదారిని ఆనుకుని చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులకు సంబంధించి ఇరువైపుల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ యంత్రాల సహాయంతో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ జేఈ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నృత్యం పోటీల్లో నితీష్ ప్రతిభ


అవార్డు అందుకుంటున్న నితీష్

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం పట్టణానికి చెందిన ముచ్చిరాయప్ప నితీష్ రాజ్‌యాదవ్ అనే బాలుడు ఈనెల 4, 5 తేదీల్లో గోవాలో జరిగిన జాతీయ స్థాయి నృత్యం పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. ఈసందర్భంగా నితీష్ రాజ్‌కు విజయనగరానికి చెందిన ప్రముఖులు శనివారం అభినందనలు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి


గుల్లసీతారాంపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీడీవో హేమసుందర్

సంతకవిటి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చీపురుపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.హేమసుందర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని బొద్దూరు, జీఎస్ పురం తలతంపర, బిళ్లాని, మందరాడ, మిర్తివలస, తాలాడ తదితర సచివాలయాలను ఆయన శనివారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో ఆయన తోపాటు ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ ఉన్నారు.

మొక్కల పంపిణీ

సంతకవిటి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సిరిపురం, రామారాయిపురం, హోంజరాం గ్రామాల్లో పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా సంస్థ అధ్యక్షుడు ప్రకాష్ కపిల్ ఆధ్వర్యంలో 3వేల టేకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు పంచాది రాంబాబు, హోంజరాం నీటి సంఘం ఉపాధ్యక్షుడు పైడి గోవిందరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

వేపాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వేపాడలో వినాయక నవరాత్రుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు ఆరు వేలమంది పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

వేపాడలో మోస్తరు వర్షం

వేపాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో మోస్తరు వర్షం కురిసింది. నాట్లు వేసిన నాటి నుంచి వర్షాలు కురుస్తుండంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండవచ్చునని రైతులు ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

నేత్ర దానం చేయండి

చీపురుపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శనివారం నేత్రదానంపై పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సుధీర్, రెడ్‌క్రాస్ డివిజన్ సమన్వయకర్త బీవీ గోవిందరాజులు, నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా సుధీర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అసలే మలుపులు.. ఆపై గుంతలు

- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు


భోగాపురం: ముంజేరు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు


సంతకవిటి: మల్లయ్యపేట వద్ద మలుపులో ఏర్పడిన గుంత

సంతకవిటి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మల్లయ్యపేట గ్రామ సమీపంలో సంతకవిటి నుంచి పొందూరు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారిపోయింది. అసలే మలుపులు ఆపై ఎక్కడికక్కడ భారీ గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారిపై ఉన్న గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. ● భోగాపురం: ముంజేరు గ్రామం సమీపంలోని రహదారిపై గల మలుపు ప్రమాకరంగా మారింది. ఈ మలుపునకు ఇరువైపులా సుమారు 12 అడుగుల లోతుగా కాలువ ఉంది. ఈ మలుపు దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేరు. దీంతో గతంలో ఇక్కడ అనేక ప్రమాలు చోటుచేసుకున్నాయి. అలాగే ఈ మలుపు వద్ద రహదారి గోతులమయంగా ఉంటుంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గోతుల రహదారిని బాగుచేయించి, రహదారికి ఇరువైపుల స్పీడ్ బ్రేకర్స్ వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

గణేష్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

కొత్తవలస, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వసంత్ విహార్‌లో ఏర్పాటుచేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు. ప్రకాష్‌బాబు అనే వ్యక్తి రూ.30వేలకు లడ్డూ దక్కించుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో వసంత్ విహార్ అధినేత వల్లూరి ప్రకాష్‌బాబుతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పీవీ రత్నాజీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, నాయకులు బంగారు రమేష్, సాగర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు కొనసాగుతాయి


వేడుకలను నిర్వహిస్తున్న బ్యాంకు సిబ్బంది

పూసపాటిరేగ, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవాన్ని స్థానిక కొప్పెర్ల బ్రాంచిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి, వినియోగదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంకు 120 ఏళ్ల ప్రయాణంలో సాధించిన విజయాలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ వి.పవన్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలను అందించటానికి కృషి చేస్తామన్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలూ ముఖ్యమే

కొత్తవలస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని తెలుగు టైటాన్స్ కబడ్డీ సీఈవో త్రినాథ్‌రెడ్డి అన్నారు. దెందేరు జడ్పీ హైస్కూల్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించుకుని ఆ సమయాన్ని చదువు మీద, క్రీడల మీద దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై మానసిక ఒత్తిడి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు టైటాన్స్ కబడ్డీ కెప్టెన్ విజయ మాలిక్, ఫిజియో థెరపిస్టు అర్జున్, ఉపాధ్యాయులు వి.కమలారాణి, బీవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

కోళ్లఫారాల పరిశీలన

పూసపాటిరేగ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారాలలో కోళ్లు రోగాలబారిన పడి మృత్యువాత పడుతున్నాయంటూ వస్తున్న వార్తలపై పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ శ్రీనివాస్, గోవిందపురం అధికారిణి రాజరాజేశ్వరిలతో పాటు ఆ శాఖ సిబ్బంది మండలంలోని కోనాడ, పూసపాటిరేగ, పసుపాం, గోవిందపురం, రెల్లివలస, కుమిలి పంచాయతీ పరిధిలలో ఉన్న కోళ్లఫారాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఈశ్వర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడా అంటువ్యాధులు ప్రబలలేదని, కోళ్లఫారాలలో 1 నుంచి 3 శాతం సాధారణంగా మృత్యువాత పడతాయని, ఇది నిర్వాహకులకు తెలిసిన విషయమేనని అన్నారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ఎస్.కోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎస్.కోట సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.కనక మహాలక్ష్మి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తరచూ బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

లక్కవరపుకోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు తగ్గట్టుగా నిరుపేదలు కార్పొరేట్ వైద్యం చేసుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్నామని ఎమ్మెల్యే లలితకుమారి తెలిపారు. శనివారం ఆమె లక్కవరపుకోటలోని తన నివాసం వద్ద 16మంది కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.12లక్షల 93వేల 303 విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చంద్రబాబు ఇచ్చిన సాయం ఏ ముఖ్యమంత్రి ఇవ్వలేదన్నారు. ఎస్.కోట నియోజకవర్గానికి ఇప్పటివరకు సుమారు రూ.3కోట్లు బాధితులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, దుర్గా ఉమేష్, కోళ్ల శ్రీను, రాయవరపు చంద్రశేఖర్, పొట్నూరు రత్నాజీ, కొల్లు రమణమూర్తి, పిల్లా అప్పలరాజు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో ప్రమీలాగాంధీ

గజపతినగరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండడంతో వార్డులవారీ జాబితాలను సిద్ధం చేయాలని ఈఆర్వో ప్రమీలాగాంధీ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చనిపోయిన వారి ఓట్లు గ్రామ పెద్దల సమక్షంలో కుటుంబ సభ్యుల వివరణ మేరకు తొలగించాలన్నారు. నియోజకవర్గం పరిధిలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1200 జనాభా దాటిన మూడు పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేశామని చెప్పారు. బొండపల్లి మండలంలోని బొండపల్లి, గంట్యాడ మండలంలోని లక్కిగాం, కరకవలస గ్రామాల్లో అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు బీఎల్వోల నియామకం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిణి వెంకటలక్ష్మి, వైసీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై చర్యలు ఏవీ?



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జామి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నడుపుతున్నారని, వీటిని నిరోధించాల్సిన శాఖ ఏంచేస్తుందని మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బెల్ట్‌షాపులకు ప్రధాన షాపుల నుంచి వెళ్లే మద్యం సీసాల స్టిక్కర్లు తీసేస్తూ మోసం చేస్తున్నారని, ఇది ఆ శాఖకు తెలిసినా తెలియనట్లు నటిస్తుందోన్నారు. అలాగే రైతులు యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. జడ్పీటీసీ గొర్లె సరయూ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అకారణంగా తొలగించడం దారుణమన్నారు. మండల కేంద్రంలో ఉన్న చికెన్ దుకాణాల్లో అమ్ముతున్నారని, దీనిపై ప్రజా ఆరోగ్య వ్యవస్థ ఏంచేస్తుందని పలువురు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

పొలాలు ముంపునకు గురికాకుండా చూడండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రాజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన పంట పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన రైతులు కమిషనర్ జె.రామప్పలనాయుడుకు శనివారం వినతి పత్రం అందజేశారు. పొనుగుటివలస గ్రామానికి సంబంధించి జీఎంఆర్ కాలేజీ నుంచి డోలపేట కూడలి వరకు ప్రధాన రహదారికి సంబంధించిన కాలువల నిర్మాణం చేపట్టారని చెప్పారు. అయితే మూడు చెరువులకు వెళ్లాల్సిన నీరు ఒకే చెరువుకు వెళ్లడం వల్ల ఆ చెరువు పూర్తిగా నిండిపోయి పంట పొలాలకు వెళ్లడంతో పంటలు ముంపునకు గురవుతున్నాయని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈవిషయంపై స్పందించిన కమిషనర్.. సంబంధిత అధికారులతో పరిశీలించి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

రైతు బజార్ ఏర్పాటుకు తీర్మానం

కొత్తవలస, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి అందజేసింది. శనివారం కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి సమావేశం ఛైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యంగా కొత్తవలసలో ఎప్పటి నుంచో రైతు బజార్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. అలాగే మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న ఎస్.కోట రైతు బజారు అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. కొత్తవలస మార్కెట్ కమిటీ భవనాన్ని పూర్తి చేయడం కోసం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో పాటు వైస్ ఛైర్మన్ ఆదిబాబు, దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పీవీ రత్నాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, చింతలపాలెం సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు, మార్కెట్ కమిటీ ఏడీ శివశంకర్, కార్యదర్శి విజయబాబు, డైరక్టర్ దుర్గా ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలి



అంబేద్కర్ కూడలి వద్ద నిరసన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

రాజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామూర్తి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాలకొండ రోడ్డులోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సరుకులు దిగుమతిపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో భారతీయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు. ● భారతీయ సరుకుల దిగుమతిపై సుంకాన్ని నిర్ణయాన్ని అమెరికా వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం శ్రీనివాస థియేటర్ రోడ్డులో నిరసన చేపట్టారు.

బాధితులకు న్యాయం చేయాలి

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన


పొట్టిదొర చిత్రపటంతో నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. తగ్గకపోవడంతో రెండు రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్న వన్నెపూరి పొట్టిదొర అనే గిరిజనుడి చిత్రపటంతో జిందాల్ నిర్వాసితులు శనివారం బొడ్డవరలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్ల కిందట బొడ్డవర పంచాయతీ అమ్మపాలెంకు చెందిన పొట్టిదొర చక్కగా తన భూమిని సాగుచేసుకుని కుటుంబాన్ని చక్కగా పోషించుకునేవాడని, అయితే జిందాల్ వస్తుందన్న ఆశతో భూములు ఇచ్చాడని, 18 ఏళ్లు అయినా రాకపోవడంతో భూమి కోల్పోయి కూలీగా మారిన పొట్టిదొర అనారోగ్యంతో వైద్యానికి డబ్బులు లేని పరిస్థితిలో ఇలా బలవన్మరణం పొందాడన్నారు. ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ ఈ 18 ఏళ్లలో వందమందికి పైగా నిర్వాసితులు అనారోగ్యంతో, ఇతర కారణాలతో మృతిచెందారని, వీటిపై సర్వే చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి బాధితులకు న్యాయం చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్నతోటవలస రైల్వే లైన్ వద్ద శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొని కృష్ణాపురం గ్రామానికి చెందిన బలగ మధు (23) మృతి చెందాడు.ఈ మేరకు ప్రభుత్వ రైల్వే హెడ్ కానిస్టేబుల్ బి. ఈశ్వరరావు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బలగ మధు ట్రిబుల్ ఐటీ పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు కోసం ప్రయత్నం చేస్తున్నాడు. మధుకు తండ్రి శంకరరావు, తల్లి అప్పలనరసమ్మ, తమ్ముడు రవి ఉన్నారు. మధు కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు అప్పగించారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ప్రభుత్వ రైల్వే పోలీసులు విలేకరులకు తెలిపారు.

జ్వరంతో మహిళ..

భోగాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కవులవాడ గ్రామానికి చెందిన మైనపు మంగ అనే మహిళ జ్వరంతో శనివారం మృతి చెందింది. మంగకు రెండు రోజుల కిందట జ్వరం రావడంతో భర్త నరిసింహులు ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఇంటికి తీసుకురాగా, శనివారం ఉదయం ఆమె జ్వరంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానిక ఆశా వర్కర్ సూచనతో తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి.. మంగ అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మంగకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

లక్కవరపుకోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గనివాడ గ్రామానికి చెందిన గేదెల సంతోష్(40) కనిపించడం లేదని భార్య గేదెల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నవీన్‌పడాల్ శనివారం తెలిపారు. దీనిపై ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్ వృత్తిపరంగా డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. జూలై 19వ తేదీన డ్యూటీకి వెళ్తానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లి, ఇప్పటివరకు రాలేదని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీఐ జె.జనార్ధనరావు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. కోమటిపల్లి గ్రామంలో 9 మద్యం సీసాలతో ఉల్లి అప్పలరాజు అనే వ్యక్తిని పట్టుకుని, కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ బి.గంగాధరుడు, ఎ.అప్పారావు పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: ఎక్సైజ్ అధికారుల దాడిలో 17 అక్రమ మద్యం సీసాలు పట్టుకున్నట్టు సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నెల్లిమర్ల మండలం గుషిణి, గుర్ల మండలం చింతలపేటలో దాడి చేసి పలువురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ● భోగాపురం: రావాడ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ శనివారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ చంద్రమోహన్, హెచ్‌సీ ప్రతాప్, రామారావు, తదితరులు పాల్గొన్నారు. ● గుర్ల: చింతలపేట గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడి నిర్వహించారు. అలాగే గ్రామంలో వర్కుషాపు వద్ద అక్రమంగా 16 సీసాలు ఉన్నట్టు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

పంచదార లోడుతో మినీవ్యాను బోల్తా


రోడ్డుపై బోల్తాపడ్డ మినీవ్యాను

వేపాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వేపాడ జంట గ్రామమైన వల్లంపూడిలో శానాపతి చెల్లంనాయుడు (మునసబుగారి) కల్లాల సమీపంలో అనకాపల్లి నుంచి ఎస్.కోట వైపు పంచదార బస్తాల లోడుతో వస్తున్న మినీ వ్యాను శనివారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఏ విధమైన ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న వల్లంపూడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు.

తంగుడుబిల్లి భూ వివాదంపై విచారణ


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తంగుడుబిల్లిలోని వివాదాస్పద భూమిపై శనివారం స్థానిక తహసీల్దార్ కె.శ్రీకాంత్ విచారణ చేపట్టారు. తంగుబిల్లి గ్రామంలో 2.40 ఎకరాల మెట్టు భూమికి సంబంధించి గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ భూమి తనదేనని ఆ గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడు చెబుతున్నారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని.. ఆ భూమిలో కొన్ని దశాబ్దాల కాలంగా చెరువు ఉండేదని.. గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాల రైతులు ఇటీవల ఆ భూమిలో ప్రవేశించి యంత్రాలతో మట్టి తవ్వారు. కొత్తగా గట్లను ఏర్పాటు చేశారు. దీంతో అప్పలనాయుడు వర్గీయులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ ఇరు వర్గాలను పిలిపించి విచారణ చేపట్టారు. భూ హక్కులకు సంబంధించి పత్రాలను చూపించాలని కోరారు. విచారణను తిరిగి తహసీల్దార్ ఈనెల 20వ తేదీకి వాయిదా వేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

వివాదాస్పద స్థలం ప్రభుత్వానిదేనని, ఆ స్థలంలో గత కొన్ని సంవత్సరాలుగా చెరువు ఉండేదని చెబుతూ వస్తున్న సుమారు 60 కుటుంబాలకు చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. వీరి తరపున ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త, జనసేన పార్టీ నాయకుడు లోకం ప్రసాద్ అక్కడికి చేరుకుని తహసీల్దార్‌తో మాట్లాడారు. ఎమ్మెల్యే ద్వారా అసెంబ్లీలో చర్చించేందుకు కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కోఆర్డినేటర్ కరుమ గోవిందరావు, నెల్లిమర్ల ఛైర్‌పర్సన్ బంగారు సరోజని, అప్పికొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న రజక సంఘ నాయకులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలోని ఈనెల 4న అమాయకులైన రజకులపై పెత్తనదారులు దాడి చేశారంటూ జిల్లా రజక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రజక మహిళ హత్యను నిరశిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రజకులపై రాష్ట్రంలో అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కొత్తవలస గ్రామంలోని ఓ మహిళను కిరాతంగా చంపివేశారని, ఇంకా మరో ఐదుగురికిపై దాడిలో తీవ్రంగా గాయ పడ్డారని చెప్పారు. గ్రామాల్లో బహిష్కరణకు గురవుతున్నారని, అందుకు రజకుల రక్షణ కోసం సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలని తెలిపారు. శ్రీకాకుళం ఘటనలో నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రజక సేవా నాయకులు గురజాపు సత్యారావు, కెల్ల సత్యం, అప్పలరాజు, పైడిరాజులు ఉన్నారు.

నిధులు మంజూరుకాక.. పనులు సాగక

● పారాది రైతు సేవాకేంద్రంలో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది రైతు సేవాకేంద్రం వద్ద మరుగుదొడ్ల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రైతు సేవాకేంద్రాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వ హయాంలో మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. అయితే నిధులు మంజూరుకాపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో వివిధ పనుల కోసం రైతు సేవా కేంద్రానికి వచ్చిన వారు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరుకాగానే పనులు పూర్తి చేయస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వతేజని చెప్పారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

పిల్లర్లు వేశారు.. పనులు ఆపేశారు

● ఇదీ సీహెచ్ బొడ్డవలస చెత్త సంపద కేంద్రం పరిస్థితి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డవలసలో చెత్త సంపద కేంద్రం పనులు పిల్లర్లు వరకు వేసి అర్ధాంతరంగా నిలిపివేశారు. స్వచ్ఛాంధ్రమిషన్ కింద పంచాయతీల్లోని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని, ఆపై దాన్ని సేంద్రీయ ఎరువుగా తయారు చేసి రైతులకు విక్రయించి సంపద సృష్టించాలని గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సంపద కేంద్రాలను గ్రామల్లో ఏర్పాటుచేశారు. వీటి ఏర్పాటు వల్ల గ్రామాల్లో పారిశుధ్య సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని అప్పట్లో భావించారు. దీంతో వీటి నిర్మాణాలకు నిధులు కేటాయించింది. ఈనేపథ్యంలో సీహెచ్ బొడ్డవలసలో చెత్తసంపద కేంద్రం నిర్మాణానికి 7.8 లక్షలు మంజూరయ్యాయి.తర్వాత నిధులు విడుదలకాకపోవడం తదితర కారణాల వల్ల ఈ పనులు ముందుకుసాగలేదు. తక్షణమే చెత్త సంపద కేంద్రం పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా తొలివిడతగా 20 శాతం నిధులతో చెత్త సంపద కేంద్రం పనులు ప్రారంభించారని, తర్వాత నిధులు మంజూరుకాలేదని, విడుదల కాగానే పూర్తి చేస్తామని డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు తెలిపారు.



సీహెచ్ బొడ్డవలసలో అర్ధాంతరంగా నిలిచిపోయిన చెత్త సంపద కేంద్రం

రోడ్లు ఛిద్రం

(ఐదో పేజీ తరువాయి)

రానున్న రోజుల్లో ఈరహదారి నుంచి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇదే జరిగితే దాదాపు 20 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందే.

● వైసీపీ హయాంలో రోడ్లపై గుంతలు పడినా అలాగే వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లా వ్యాప్తంగా 856 కిలోమీటర్లలో గుంతలు పూడ్చడానికి దాదాపు రూ.23 కోట్లు ఇచ్చింది. దీంతో రోడ్లు కొంతవరకు బాగు పడ్డాయి కాని ఆయా రోడ్ల పరిధిలో ఉన్న కల్వర్టులు అలాగే ఉన్నాయి. బొబ్బిలి డివిజన్ రాజాం పరిధిలో ఉన్న కల్వర్టులన్నీ చాలా వరకూ కుంగిపోయాయి.

ప్రధాన రహదారిలో అడుగుకో గొయ్యి

కొత్తవలస-విజయనగరం రహదారిలో అడుగుకో గొయ్యి కనిపిస్తోంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కొద్దినెలల కిందట రోడ్లకు మరమ్మతులు చేపట్టినప్పటికీ ఈ రహదారిలో పనులు చేయలేదు. కొత్తవలస- విజయనగరం రోడ్డులో మండల సరిహద్దు గ్రామమైన చినరావుపల్లి వరకు పరిస్థితి అధ్వానంగా ఉంది. చినరావుపల్లి వద్ద రైల్వేగేట్‌పై వేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద కూడా గోతులు పడడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పరిశీలించాం. వాటి మరమ్మతులకు అంచనాలు తయారు చేశాం. జిల్లా వ్యాప్తంగా 139 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్టు గుర్తించి రూ.4.30 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. నిధులు రాగానే ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు చేస్తాం.

-కాంతిమతి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ

ఆ పీఏసీఎస్‌లకు కమిటీలు ఎప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

సతివాడ నియోజకవర్గంగా ఉండేది. ఇక్కడ ప్రతిసారీ ఆ పార్టీ అభ్యర్థే గెలుపొందుతూ వచ్చారు. నెల్లిమర్లగా రూపాంతరం చెందిన తరువాత కాంగ్రెస్ ఒకసారి, వైసీపీ, టీడీపీలు చెరోసారి గెలిచాయి. 2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఈ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా లోకం నాగమాధవి పోటీచేసి గెలిచారు. అయితే అప్పటికే అక్కడ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ రాష్ట్రస్థాయిలో పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించడంతో బంగార్రాజు మనస్తాపానికి గురయ్యారు. పార్టీ అధినేత సముదాయించడంతో మెత్తబడ్డారు. నాగమాధవి గెలుపునకు కృషిచేశారు.

ఆది నుంచీ..

ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన మధ్య విభేదాలు తలెత్తాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. బంగార్రాజుకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కాక ప్రొటోకాల్ వివాదం మొదలైంది. నెల్లిమర్ల మునిసిపల్ సమావేశానికి బంగార్రాజు హాజరైతే.. ఏ హోదాలో వచ్చారని ఎమ్మెల్యే నాగమాధవి ప్రశ్నించారు. ఆ సమయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగాక ఎమ్మెల్యే అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన ఇరు పార్టీల అధినాయకత్వాల దృష్టికి వెళ్లడంతో ఇద్దరికీ పిలుపు వచ్చింది. వారిని సముదాయించి సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించినా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టే ఉన్నారు.

● డెంకాడ మండలంలో డెంకాడ, జొన్నాడలో పీఏసీఎస్‌లు ఉన్నాయి. జొన్నాడ పీఏసీఎస్ జనసేన ఖాతాలోకి వెళ్లిందని అంటున్నారు కానీ ఇంకా స్పష్టత లేదు. డెంకాడ విషయంలో కూడా సుదీర్ఘంగా చర్చలు సాగుతున్నా కొలిక్కి రాలేదు.

● నెల్లిమర్ల మండలంలో మూడు పీఏసీఎస్‌ల ఉన్నాయి. మొయిద, సతివాడ, తుమ్మలపేట పీఏసీఎస్‌ల్లో టీడీపీ, జనసేన మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. వారి మధ్య ఏకాభిప్రాయం రావడం లేదు.

● భోగాపురం మండలంలో రెండు పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఇక్కడ కూడా ఇరుపార్టీలు పోటీపడుతున్నాయి. పోలిపల్లి, భోగాపురం పీఏసీఎస్‌కు సంబంధించి ఇరుపార్టీల నాయకులు వారి అనుచర వర్గానికి చెందిన పేర్లను ప్రతిపాదిస్తూ అమరావతికి పంపించారు. అక్కడి నుంచి ఇంకా స్పష్టత రాలేదు.

● పూసపాటిరేగ మండలంలో వెంపడాం,పూసపాటిరేగ, లంకల పల్లిపాలెం, కుమిలి వద్ద పీఏసీఎస్‌లు ఉన్నాయి. నాలుగు చోట్ల ఇరు పార్టీలనుంచి ఎనిమిది మంది ఆసక్తి చూపుతున్నారు. ఎవ్వరూ తగ్గడం లేదు.

అప్పుడు 40 అడుగులు.. ఇప్పుడు 4 అడుగులే

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీ సర్వేనెంబరు 125లోని గెడ్డకాలువను 62 సెంట్ల విస్తీర్ణంలో కప్పేసి వెనుకున్న వెంచర్‌కు రోడ్డు వేస్తున్నారని ఈనెల 1వ తేదీన కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో పడాలపేటకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బందిని పంపిస్తామని కలెక్టర్ కార్యాలయ సిబ్బంది చెప్పారు. కానీ ఇంతవరకు ఒక్క అధికారి కూడా అక్కడకు రాలేదని స్థానికులు తెలిపారు. ఆనపాము చెరువునుంచి నారాయణపురం గంపబంద చెరువు వరకు ఈ కాలువ ద్వారా నీరు వెళ్తుంది. వందలాది ఎకరాలకు నీరు అందించే ఈ కాలువ చాలా వరకు కుచించుకుపోయిందని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలువ ఎక్కువ భాగం కబ్జా అయిపోవడంతో వర్షాకాలంలో చెరువు నిండిపోయాక ప్రవాహానికి స్థలం చాలక గ్రామంలోని కొంతప్రాంతం ముంపునకు గురవుతోందని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణదారులకు నేతల సహకారం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పరిరక్షిస్తాం

పడాలపేటలో పంటకాలువ మీదుగా రోడ్డు నిర్మించారనే విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. ఆరోపణలు వచ్చిన ఆనపాము చెరువు నుంచి గంపబందకు వెళ్లే కాలువను పరిశీలిస్తాం. ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే కాలువను పరిరక్షించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

- కూర్మనాథ్, తహసీల్దార్ విజయనగరం

నిబంధనలు పాటించకపోతే చర్యలు: ఏవో

గరుగుబిల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఏవో జ్యోత్న్న హెచ్చరించారు. శనివారం ఖడ్గ వలస సముదాయంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులకు సంబంధించి అవసరమైన పత్రాలు లేకపోతే లైసెన్స్ రద్దుచేస్తామని తెలిపారు. కార్య క్రమంలో ఏఈఓ ఎ.హరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం: విప్

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయం ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్‌కుమార్, మరడా తవిటినాయుడు, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల టీడీపీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కేవీ కొండయ్య, చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యకుడు రాకోటి రాములు



ధర్నా చేస్తున్న గిరిజనులు, రైతుసంఘం ప్రతినిధులు

బొబ్బిలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):మెంటాడ మండలంలో దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు, అటవీ భూములకు సాగు పట్టాలివ్వాలని జిల్లా వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షుడు రాకోటి రాములు డిమాండ్ చేశారు. శనివారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా గిరిజనులు రిజర్వుఫారెస్ట్ భూములను సాగు చేసుకుంటున్నా పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. గిరిజనులు సాగుచేస్తున్న అటవీ భూమిని జిరాయితీగా చూపించి ప్రైవేట్ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాసుబుక్కు జారీ చేశారని ఆరోపించారు. భూమి హక్కు నిర్ధారణ అయిన తరువాత కూడా రిజిస్ట్రేషన్ రద్దు చేసి పేదలకు ఎందుకు పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆగూరు రెవెన్యూలో సుమారు 57 ఎకరాల భూమి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని, ఆ భూమిని సంఘం గుడ్డివలస, ఎర్ర గడ్డవలస, పనుకువానివలస, సెడగంవలసలకు చెందిన 80 కుటుంబాల సాగు చేసుకుని జీవిస్తున్నాయని తెలిపారు. తక్షణమే నకిలీ పత్రాలను రద్దు చేసి సాగు చేసుకుంటున్న గిరిజనకుటుంబాల వారికి పట్టాలను మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

సచివాలయ కార్యదర్శుల నిరసన



కమిషనర్ రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు

బొబ్బిలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమకు వలంటీర్ విధుల నుంచి తమను తప్పించాలని, తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని వార్డుసచివాలయాల కార్యదర్శులు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక మునిపిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర సచివాలయాల ఉద్యోగుల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపుమేరకు వార్డు సచివాలయాల కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఒక్కో సచివాలయ కార్యదర్శి తమకు కేటాయించిన 200 ఇళ్లకు వెళ్లి వారి అవసరాలను గుర్తించేవిధంగా సర్వేచేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించామని చెప్పారు. అనంతరం కమిషనరు లాలం రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాజేశ్, సౌజన్య, కుమార్, సురేష్, అల్లు అప్పలస్వామి, గుల్ల మౌర్య పాల్గొన్నారు.

మండల సమావేశంలో నిలదీత

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మండల సమావేశంలో పలు అంశాలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. శనివారం ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధికారులు తమ శాఖల ద్వారా మండలంలో అందిస్తున్న సేవలను వివరించారు.ఈ సందర్భంగా ఉప ఎంపీపీ అరసాడ శంకరరావు మాట్లాడుతూ అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని కోరారు. కమ్మవలస సర్పంచ్ పి.వసుంధర మాట్లాడుతూ 15వ ఆర్థికసంఘం నిధులు పంచాయతీలకు విడుదలచేయాలని కోరారు. ఏవో శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాలను ఈ-క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. చింతాడ పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు మాట్లాడుతూ యూరియా అందక వరిపైరు పాడవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. మండల వైద్యాధికారి భరద్వాజ్ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మెట్టవలస సర్పంచ్ మాధవ్ మాట్లాడుతూ పంటపొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాల్లో స్వామిత్వ సర్వేకు సహకరించాలని కోరారు. సమవేశంలో జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, ఉపాధిహామీ ఏపీవో లక్ష్మీపతిరాజు, విద్యుత్ ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ప్రసాదరావు

రామభద్రపురం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధించడంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీజాన్, ఎంపీడీవో రత్నం, డీటీ గిరిధర్, వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ అనిత, డీసీపీయూ సోషల్ వర్కర్ సరస్వతి, బెజ్జిపురం ఎన్జీవో ప్రతినిధి హరీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, కృష్ణకుమారి, సూర్యకుమారి పాల్గొన్నారు.

44 పనుల మంజూరు : ఏఈ

రామభద్రపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో 22 పంచాయతీల్లో 10.62 కోట్ల రూపాయలతో 44 అభివృద్ధి పనులు మంజూరైనట్టు పంచాయతీరాజ్ ఏఈ రమేష్ తెలిపారు. శనివారం రామభద్రపురంమండల ఇంజనీరింగ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల్లో డబ్ల్యూబీఎం, మెటల్, బీటీతోపాటు సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆరికతోట, ఇట్లామామిడిపల్లి, బూసాయవలస, మామిడివలస, కోటశిర్లాం, జన్నివలస, కొండకెంగువ, రామభద్రపురం, మిర్తివలస, రావివలస పనులు మంజూరుకావడంతో త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ హర్ష పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

బొబ్బిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలోని కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయవ్యాధి నివారణ, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎల్. శ్రీకాంత్‌బాబు, ఉమ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు జయప్రసాద్ ఎంపిక

బొబ్బిలి రూరల్,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిరిడి గోకుల్ గ్రూప్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ జాతీయస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికైనట్లు నీతి ఆయోగ్ గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్స్ ఇండియా వారు ప్రకటించారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో 1800 మంది దరఖాస్తు చేయగా 395 మంది మాత్రమే అర్హత సాధించారు. ఎంపిక ప్రమాణాల ప్రకారం 52 మందిని ఎంపికచేసి ప్రశంసాపత్రాలతో సన్మానించారు.

9న మాజీ సైనికులకోసం దర్బార్

బొబ్బిలి/రూరల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పాత కోటలో గల మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో మాజీ సైనికులు, ఆయా కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల తొమ్మిదో తేదీన సైనిక దర్బార్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు మరడ రామినాయడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం బొబ్బిలిలో వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ ఎస్ ప్రసాదరావు , మాజీ సైనికులకు వర్తించే వివిధ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి గోవిందనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులకు అగచాట్లు

రామభద్రపురం,సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి):యూరియా కొరతతో రైతులు అగచాట్లకు గురవుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఆలస్యంగా ఉబాలు జరిగాయి. దీంతో మొదటి దఫా ఎరువులు చల్లడానికి రైతులు ఎగబడుతున్నారు. ప్రస్తుతం వరితోపాటు ప్రత్తి మొక్కజొన్న పంటలకు కూడా ఎరువులు అవసరం కావడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. కొంతమంది ప్రస్తుత అవసరాలకు కాకుండా రానున్న రోజులకు కూడా యూరియా నిల్వ చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతుకు ఒక్కో బస్తా ఇవ్వడంతో పంటలకు సరిపడడం లేదని వాపోతున్నారు. మూడు రోజులకు ఒకసారి లోడు వస్తుండడంతో రైతులు ఎరువుల కోసం షాపుల వద్ద బారులుతీరుతున్నారు.



రామభద్రపురంలో ఎరువుల దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

9న 'అన్నదాత పోరు'

బొబ్బిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల తొమ్మిదో తేదీన చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్నశీను) పిలుపునిచ్చారు. శనివారం బొబ్బిలిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అధ్యక్షతన బొబ్బిలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తూముల భాస్కరరావు, సావు మురళీ కృష్ణారావు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

బొబ్బిలిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్నశీను) జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంపై వైసీపీ పట్టణాధ్యక్షుడు సీహెచ్ రమేష్, నాయకులు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా వైసీపీ నేత ఫెక్సీలను చింపివేయడం సరికాదని ఎమ్మెల్యే బేబీనాయన ఖండించారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఇటువంటి దురాగతమైన సంస్కృతికి తావులేదని పేర్కొన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్‌తో మాట్లాడి ఈ దుశ్చర్యకు పాల్పడిన వారెవరైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఎమ్మెల్యే బేబీనాయన హుందాగా వ్యవహరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాడంగి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కోరారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై అవగాహన

గరుగుబిల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా రెండో అదనపు న్యాయాధికారి ఎస్.దామోదరరావు హెచ్చరించారు. శనివారం గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాల ఆవరణలో గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఐ ఫకృద్దీన్, ప్రిన్సిపాల్ ఎ.రజనీ కుమారి, ఉప ప్రిన్సిపాల్ జి.లక్ష్మమ్మ, లోక్ అదాలత్ మెంబర్లు టి.జోగారావు, జి.వెంకటరావు, న్యాయవాది ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధంపై దృష్టి సారించాలి

దేవదాయశాఖ పరిధిలోని దేవస్థానాల్లో బాల్య వివాహాలు నిరోధానికి దృష్టి సారించాలని దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ సూచించారు. శనివారం తోటపల్లి దేవస్థానం ఆవరణలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ భాగస్వామ్యంతో అప్‌హోల్డ్ యక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్టు ప్రతినిధులు బాల్య వివాహాలు నిరోధానికి సంబంధించి పోస్టర్లను ఏర్పాటు చేశారు.

వైద్య కళాశాలలు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. పీపీపీ విధానం వల్ల వైద్యం, వైద్య సేవలు, వైద్య విద్య మరింత ఖరీదు అవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

స్త్రీశక్తి సభను విజయవంతం చేయండి

సాలూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్న స్త్రీశక్తి సభను మహిళలు విజయవంతం చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు శనివారం సభా వేది క ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆగస్టు 15నుంచి మహిళలకోసం ఉచిత బస్సు పథకం ప్రవే శపెట్టడంతో కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సభను నిర్వహిస్తునకనట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

గరుగుబిల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాల్లో లబ్ధిదారులు జాప్యం చేస్తే పథకం రద్దు అవుతుందని ఎంపీడీవో జి.పైడితల్లి, గృహ నిర్మాణశాఖ ఏఈ వి.అఖిల్ సూచించారు. నిర్మాణాలకు సంబంధించి విధించిన సమయంలోగా పూర్తి చేయాలని కోరారు.శనివారం మండలంలోని పెద్దూరు. సన్యాసిరాజుపేట, పెదగుడబ గ్రామాల్లో నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వపరంగా బిల్లులు దఫదఫాలుగా చెల్లించనున్నట్లు తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన మేరకు లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తాలు జమ చేస్తున్నామన్నారు.

టారిఫ్‌లను రద్దు చేయాలి

బెలగాం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒప్పందాలను ధిక్కరించి అమెరికా నుంచి దిగుమతి అయ్యే సరుకులపై భారీగా ట్రంప్ విధించిన టారిఫ్‌లు రద్దుచేయాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. పన్నులు పెంచడం మోడీ అసమర్థతకు నిదర్శమని వామపక్ష విమర్శించారు. శనివారం పార్వతీపురం ఆర్టీసీ కూడలిలో అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తూ వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కృష్ణమూర్తి, కుమార్, సంగం తదితరులు పాల్గొన్నారు.

26 టన్నుల బియ్యం స్వాధీనం

పాచిపెంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోనవలస ఆంధ్రా - ఒడిశా చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి ఒడిశాకు అక్రమంగా రవాణా చేస్తున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తుని నుంచి లారీలో ఒడిశా తరలిస్తుండగా విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, ఎస్ఐ రామారావులు పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ డీటీ జి.హేమలతకు అప్పగించారు. ఈ మేరకు సీఎస్‌డీటీ హేమలత 6ఏ కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ ఎదుట పెట్టారు. ఈ మేరకు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.